క్లుప్తంగా

అనాథ చిన్నారులకు సాయం



ఆర్థిక సాయం చేస్తున్న దాత సత్యనారాయణ

కొయ్యూరు: తల్లిదండ్రులను కోల్పోయి పేదరికంతో ఇబ్బందులు పడుతున్న ముగ్గురు చిన్నారులకు రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ గురువారం ఆర్థిక సాయమందించారు. చిన్నారులతో పాటు వారి నాన్నమ్మకు దుస్తులు అందజేసి, కొంత నగదును ఇచ్చారు. ఈ సందర్భంగా దాత సత్యనారాయణ మాట్లాడుతూ చిన్నారుల తల్లి రెండేళ్ల క్రితం మరణించగా, రెండు నెలల క్రితం తండ్రి కూడా మృతి చెందడంతో చిన్నారులు అనాథులైనట్టు చెప్పారు. వారి నాన్నమ్మ చెంతనే ఉంటున్నారు. పేదరికంతో అల్లాడుతున్న చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారిని ఆదుకోవడానికి తమ వంత సాయమందించినట్టు చెపాపరు. వారికి నివాసం ఉండేందుకు సొంత గృహం కూడా లేదన్నారు.దాతలు ముందుకు వచ్చి అనాథ కుటుంబానికి అండగా ఉండాలని కోరారు. సర్పంచ్ త్రినాథ్ పడాల్, రామకృష్ణ, అశోక్ లాల్ తదితరులు పాల్గొన్నారు

షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా బాబా ఆలయ ప్రాంగణంలోని ఉప ఆలయంలో గల సాంబశివునికి పురోహితుడు భానుమూర్తి భక్తులచే అభిషేకాలు చేయించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి రామకృష్ణ అన్నదాన కార్యక్రమం నిర్వహణకు విరాళం అందజేశారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు



గణపర్తిలో నాటిక ప్రదర్శన

మునగపాక: మండలంలోని గణపర్తి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన నాటిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కనుమ పండగ సందర్భంగా స్థానిక నవతరం సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. నాన్నకు ప్రేమతో, జై జవాన్..జై కిసాన్ నాటికలతో పాటు భరతనాట్యం వంటి ప్రదర్శనలు అలరించాయి. ఆహూతులను ఆకట్టుకునేలా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.

వృద్ధ దంపతులకు సత్కారం

మునగపాక: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటు పడాలని శ్రీవెంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు కోరారు. మండలంలోని గొల్లలపాలెంలో కనుమ పండుగ సందర్భంగా బుధవారం రాత్రి 60 సంవత్సరాలు దాటిన 20 మంది దంపతులను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ప్రతి ఒక్కరూ ప్రేమించాలన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులపై చిన్నచూపు లేకుండా వారిని అన్ని విధాలుగా ఆదుకొని అండగా నిలవాలన్నారు.

20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

మాడుగుల: చీడికాడ, మాడుగలు మండలాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు జరగనున్నాయని ఏడీ వి. చిట్టినాయుడు తెలిపారు. దూడలు, పెయ్యిలకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందిస్తామన్నారు. ఎదకు రాని, గర్భకోశ వ్యాధులున్న పశువులకు ఉచిత వైద్యంతోపాటు మందులు అందజేస్తామన్నారు. రోజుకు రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

దారుణ దారులు

అధ్వాన రహదారులతో ఇక్కట్లు
ప్రమాదకరంగా వంతెనలు, కల్వర్టులు
పట్టించుకోని పాలకులు



కోడిపుంజువలస- వర్రా రహదారి దుస్థితి



రణజిల్లెడ- హట్టగుడ మార్గంలో కూలిన కల్వర్టు



గన్నెల రైలు అండర్ బ్రిడ్జి సమీపంలో పైపులైన్ల దుస్థితి



అరకు-పాడేరు రహదారిలో యండపల్లివలస వద్ద ప్రమాదకరంగా మారిన వంతెన

అరకులోయటౌన్: గిరిజన ప్రాంతంలో పలు గ్రామాల్లో రహదారులు, కల్వర్టులు, వంతెనలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. కల్వర్టులు వంతెనలు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుత పాలకులు వాటిని బాగు చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ రహదారుల్లో రాకపోకలు సాగించే వాహనచోదకులు, ఆటోలు, జీపులు నడిపే డ్రైవర్లు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీ ఉండే ప్రాంతాలను అధికారులకు పట్టించుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. తాము అధికారంలోకి వస్తే రహదారులన్నీ సుందరంగా తీర్చిదిద్దుతామని ఎన్నికల ప్రచారంలో వాగ్దానాలు చేసిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా రహదారులు బాగు చేసినా దాఖలాలు లేవు. ప్రభుత్వం, పంచాయతీ, జిల్లా పరిషత్ రోడ్లు బాగు చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో మండల కేంద్రంతో పాటు వారపు సంతలకు వచ్చేందుకు గిరిజనులు తీవ్ర నానా అవస్థలు పడుతున్నారు. కూటమి పాలకులు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చి, రోడ్లు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- అరకులోయ నుంచి పాడేరు వెళ్లే రహదారిలో యండపల్లివలస సమీపంలోని గెడ్డ వంతెన వద్ద బ్రిడ్జి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన వద్ద అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా వంతెన వద్ద కోతకు గురైన ప్రదేశంలో బాగు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.
- ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రణజిల్లెడ- హట్టగుడ రహదారిలో కల్వర్టు కోతకు గురైంది. దీంతో రాత్రిళ్లు ఈ మార్గంలో ప్రయాణించేందుకు వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఈ రహదారి మీదుగా ప్రతీ రోజు స్థానిక ప్రజలతోపాటు పర్యాటకులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందు కల్వర్టు బాగు చేయాలని ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.
- విశాఖ – అరకు రహదారిలోని గన్నెల జంక్షన్ నుంచి గన్నెల గ్రామం వరకు సుమారు 6 కిలోమీటర్లు రహదారి అధ్వానంగా ఉంది. ఈ రహదారి మీదుగా సుంకరమెట్ట వారపు సంతకు లోతేరు, ఇరగాయి, గన్నెల, బొండాం, మాదల, పెదలబుడు, కొత్త భల్లుగుడ పంచాయతీల రైతులు పండించిన పంటలు, అటవీ ఉత్పత్తులను ఈ రహదారి మీదుగా పలు ప్రాంతాల్లో జరిగే సంతలకు తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు అండర్ బ్రిడ్జి సమీపంలోని వంతెన ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయింది. అధికారులు తూతూ మంత్రంగా పైపులు వేసి గ్రావెల్, క్రషర్ వేసి విడిచి పెట్టారు. వర్షం పడితే ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- సుంకరమెట్ట నుంచి జనంగుడ, మాడగడ, చొంపి, శిరగాం మీదుగా డుంబ్రిగుడ మీదుగా పెదపాడు గ్రామాల మీదుగా నిర్మించిన రహదారి శిథిలమైంది. రాళ్లు తేలి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా ఎం. హట్టగుడ-మాడగడ మధ్యలో సుమారు 20 మీటర్లు రహదారి పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తోందని స్థానికులు చెబుతున్నారు. రాకపోకలకు ఇబ్బందిగా మారిందంటున్నారు. ద్విచక్రవాహనచోదకులు గోతుల్లో పడి గాయాలపాలువుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యపై అరకులోయ డివిజన్ పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం డీఈ రామం మాట్లాడుతూ రహదారులు బాగు చేసేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

ప్రభుత్వం స్పందించాలి



ప్రతీ రోజు గన్నెల జంక్షన్ నుంచి ఐదు పంచాయతీల ప్రజలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతీ ఆదివారం వ్యవసాయ, వాణిజ్య పంటల విక్రయానికి సంతకు తీసుకువెళ్లి వస్తుంటాం. రహదారి బాగులేక నానా అవస్థలు పడుతున్నాం. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి రహదారి బాగు చేయాలి.

– శెట్టి గురుమూర్తి, అమలగుడ గ్రామం, గన్నెల పంచాయతీ, అరకులోయ

పెరుగుతున్న ప్రమాదాలు



మండల కేంద్రం నుంచి ప్రతీ రోజు నాలుగు పంచాయతీల ప్రజలు రోజు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి శిథిలదశకు చేరడంతో రాకపోకలకు నరకయాతన పడుతున్నాం. ద్విచక్ర వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోజురోజుకు ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ఉన్నతాధికారులు స్పందించి రహదారి బాగుచేయాలి.

– జన్ని సోములు, కప్పల గొంది గ్రామం శిరగాం పంచాయతీ, అరకులోయ మండలం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కూనవరం: తీయని మాటలు.. అలనాటి కబుర్లు.. అల్లర చిల్లర శ్రేష్టలతో ఆట పట్టించుకున్న సందర్భాలను గుర్తు చేసుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని 20 ఏళ్ల నాటి పూర్వ విద్యార్థులు పలువురు వ్యాఖ్యానించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 2003–2004 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో, వివిధ వృత్తుల్లో స్థిరపడ్డ వారంతా సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వారంతా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అందరూ సమావేశమయ్యారు. అలనాటి పిక్నిక్ పార్క్‌గా బాసిల్లిన దారపల్లి అటవీ ప్రాంతాన్ని సందర్శించి ఆత్మీయ సమావేశం కార్యక్రమం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకొరికొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో సరదాగా గడిపిన ప్రదేశాలను చూసి మురిసిపోయారు. గత స్మృతులను నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. పూర్వ విద్యార్థులు ఎస్.వెంకన్న, వై.గౌతం, ఎస్.వెంకట్, ఎం.వినయ్‌ప్రసాద్, కె.పద్దయ్య, పి.వెంకటేష్, కృష్ణార్జునరావు, బి.రామారావు, కె.శ్రీను, కె.ఉమామహేశ్వరి, స్వాతి, అపర్ణ, సౌందర్య, లలిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంక్రాంతి పండగ సందడి



హుకుంపేటలో థింసా నృత్యం చేస్తున్న యువత



పాతగంగవరంలో బహుమతులు అందజేస్తున్న వైస్ ఎంపీపీ గంగాదేవి తదితరులు

గంగవరం : సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని వైస్ ఎంపీపీ కె.గంగాదేవి, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు కొమ్మన చిన్నారావు అన్నారు. పాత గంగవరం గ్రామంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా ముగిశాయి. సంక్రాంతి సంబరాలు సందర్భంగా ముగ్గుల పోటీలు, కబడ్డీ , మ్యూజికల్ చైర్ పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు. ఆటల పాటలతో గ్రామంలో పండగ సందడి ముగిసింది. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు కమిటీ సభ్యులు అందజేశారు. సత్యవేణి, ప్రసాద్, సాయి, పవన్, గిరిజన మిత్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఉదయ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పండగను పురస్కరించుకుని గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యువతీ, యువకులు థింసా నృత్యాలతో సందడి చేశారు. బుడియాలు విచిత్ర వేషధారణతో ఆకట్టుకున్నారు.

గ్రామాల్లో తీర్థాల సందడి



అంభేరుపురంలో విద్యుత్ దీపాలంకరణలో అమ్మవారి ఆలయం



ముద్దుర్తి గ్రామంలో జరిగిన ఎడ్లబళ్ల పోటీల్లో దౌడుతీస్తున్న ఎడ్లబండి



నక్కపల్లిలో నంది తీర్థంలో భక్తుల సందడి

చోడవరం: సంక్రాంతి తీర్థాలతో గ్రామాలన్నీ సందడిగా మారాయి. నియోజకవర్గంలో చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో సంక్రాంతి పండగ నుంచి గ్రామ దేవతల ఉత్సవాలు, తీర్థాలు జోరుగా సాగుతున్నాయి. చోడవరం మండలంలో ముద్దుర్తి, అంభేరుపురం గ్రామాల్లో గురువారం గ్రామ దేవతల తీర్థాలు సంబరంగా జరిగాయి. ముద్దుర్తిలో శ్రీరాముల వారి తీర్థం జరిగింది. ఈ సందర్భంగా ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించారు. పోటీల్లో చోడవరం పరిసర మండలాల నుంచి 15 ఎడ్లబళ్ల పోటీ పడ్డాయి. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామంలో భారీ విద్యుత్ అలంకరణ ఆకట్టుకుంది. అంబేరుపురం గ్రామంలో మరిడిమాంబ తీర్థం జరిగింది.

ఘనంగా నంది తీర్థం

నక్కపల్లి: నక్కపల్లిలో గురువారం నంది తీర్థం ఘనంగా జరిగింది. నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న నందీశ్వరుడి ఆలయం వద్ద ప్రతి ఏటా ముక్కనుమ రోజున తిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీ. చుట్టు పక్కల గ్రామాల నుంచి తోడపెద్దులను తీసుకువచ్చి సంబరాలు, చెట్టు భజనలు చేశారు. గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు హాజరై నందీశ్వరుడ్ని దర్శించుకున్నారు. ఒడ్డిమెట్టలో లక్ష్మీగణపతి ఆలయం వద్ద పరస జరిగింది.

‘మహిళలపై దౌర్జన్యం తగదు’

కొయ్యూరు: కనుమ పండగనాడు బుధవారం సంప్రదాయం ప్రకారం విరాళాలు అడిగిన గిరిజన మహిళలపై మైదాన ప్రాంతం నుంచి వచ్చిన కొందరు దౌర్జన్యం చేసి వారి వంట పాత్రలు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ పలు హిందూ సంఘాలు గురువారం ఆందోళన చేశాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని విశ్వహిందూ పరిషత్ నాయకులు మల్లిబాబు తెలిపారు. కనుమనాడు బూదరాళ్ల పంచాయతీ నూకరాయితోటలో విరాళాలు అడుగుతున్న మహిళలపై కొందరు దాడులు చేశారన్నారు. విరాళాలు ఇవ్వచ్చు.. లేదా ఇవ్వకపోవచ్చని, అలా కాకుండా కోపంతో వంటపాత్రలను ధ్వంసం చేశారన్నారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ ప్రతినిధులు కాకూరి వీర్రాజు, సద్దా వెంకటేశ్వర్లు, బంగారు సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

20న మండల సమావేశం

చింతపల్లి: చింతపల్లి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అనూషదేవి అధ్యక్షతన ఈ నెల 20న నిర్వహిస్తున్నట్టు చింతపల్లి ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

మల్లంపాలెంలో ముగ్గుల పోటీలు



విజేతకు బహుమతి ఇస్తున్న నిర్వాహకులు

కె.కోటపాడు: మల్లంపాలెంలో ముగ్గుల పోటీల్లో విజేత మహిళలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కనుమ పండగ పురస్కరించుకుని బుధవారం రాత్రి ఈ పోటీలను నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మహిళలు సంక్రాంతి విశిష్టత ఉట్టిపడేలా రంగులతో ముగ్గులు వేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బొడ్డు లక్ష్మి దేముడుబాబు, జాగరపు కన్నంనాయుడు, వార్డు సభ్యులు వంటాకు గోవిందరావు, వంటాకు రామునాయుడు, కర్రి అప్పారావు, వంటాకు చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోదమ్మకు వెండి బహూకరణ

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో వెలసిన మోదకొండమ్మకు గ్రామానికి చెందిన గొల్లవిల్లి వరహామూర్తి, నాగమణి దంపతుల కుమార్తెలు పైడి శ్రీలక్ష్మి, సుష్మశ్రీ లక్ష్మి సంయుక్తంగా పావు కిలో వెండిని బహూకరించారు. ఆలయ చైర్మన్, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు గురువారం ఉదయం అందజేసి తమ భక్తిభావం చాటుకున్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

మునగపాక: యువత సన్మార్గంలో నడవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ సూచించారు. మునగపాక దళితవాడలో బుధవారం రాత్రి నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు తమలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తన గమనించాలన్నారు. సర్పంచ్ అప్పారావు, దళిత నాయకులు నాగభూషణం, రామ్మోహనరావు, లక్ష్మణరావు, గణేష్, అనిల్‌కుమార్, ప్రసాద్, అచ్చియ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆటల పోటీలు



విజేత టీమ్‌కు షీల్డు, నగదు బహుమతి ఇస్తున్న మాజీ ఎంపీటీసీ ప్రకాష్, గ్రామపెద్ద ఖాన్

జి.మాడుగుల: మండలంలో వంజరి పంచాయతీ కిముడుపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల స్థాయి క్రికెట్, వాలీబాల్ టోర్నీమెంట్‌లు గ్రామ పెద్ద ఖాన్ ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా జరిగాయి. క్రికెట్ పోటీల్లో బలిజపేట ప్రథమ బహుమతి గెలిపొందగా విజేత టీమ్‌లకు రూ.7000నగదు, షీల్డు, గొందిమెలక గ్రామం ద్వితీయ బహుమతి గెలుపొందగా విజేత టీమ్‌కు రూ.3000నగదు, షీల్డులను నిర్వాహకులు ఖాన్, మాజీ ఎంపీటీసీ కె.ప్రకాష్, వార్డు సభ్యుడు గిరిబాబు, వీసీ కమిటీ ఉపాధ్యక్షుడు కృష్ణ, దేవదాస్, మత్స్యరాజు అందజేశారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో సువ్వపాడు జట్టు ప్రథమ బహుమతి గెలిపొందగా విజేత టీమ్‌కు రూ.7,000నగదు, షీల్డు అందించగా, ద్వితీయ బహుమతి పొందిన మద్దెలగొంది రూ.3000నగదు, షీల్డులను వారు అందజేశారు. నిర్వాహకులు దావీదు, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు కాటమస్వామి వేడుకలు



కాటుమల్లేశ్వర స్వామి వారి విగ్రహాలు



కాటుమల్లేశ్వర స్వామి వారి ఆలయం

గంగవరం: మొల్లేరు పరిసర గ్రామాల ఆరాధ్య దైవాలు, కోర్కెలు తీర్చే దేవుడు కాటుమల్లేశ్వర స్వామి (కాటమస్వామి), బంగారు పాపాయమ్మ తల్లి జాతర మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు కాటమస్వామి జాతరను ఘనంగా నిర్వహించేందుకు నిర్వహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గంగవరం మండలం శివారు గ్రామమైన మొల్లేరు – బి.శివరామపట్నం గ్రామాల మధ్య వెలసిన కాటుమల్లేశ్వర స్వామి, గ్రామదేవత బంగారు పాపాయమ్మ తల్లి ఉత్సవాలను ఏటా జనవరిలో అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఏటా కనుమ రోజు రాత్రి గ్రామంలో జాగారం నిర్వహిస్తారు. స్వామి వారి గరగలు, తాడిపెద్దు, భజనల నిర్వహించి గుడి చేరుకుంటారు. ముక్కనుమ రోజు నుంచి ఐదు రోజులు జాతర నిర్వహిస్తారు. కాటుమల్లేశ్వర స్వామి, బంగారు పాపాయమ్మలు ఇరువురు సోదరి, సోదరులని మొల్లేరు వాసులు తెలిపారు. భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. జాతర ఐదురోజులు వివిధ సాంస్కృతిక, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అపరాల సాగుపై దృష్టి సారించాలి



పొలంలో క్షేత్ర సందర్శన చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

పాయకరావుపేట: మండలంలోని మాసాహేబుపేట, పెంటకోట గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర సందర్శనతో పాటు రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి మాగాణుల్లో అపరాల సాగుపై దృష్టి సారించాలన్నారు. రైతులు ప్రభుత్వం ఇచ్చే కనీస మద్దతు ధరకు తమ ఉత్పత్తులను విక్రయించుకోవాలన్నారు.

ఎకరానికి 2 బ్యాగ్స్ ఎస్ఎస్‌పీ వేసుకోవడం వల్ల పంట దిగుబడి బాగా వస్తుందని, అపరాలు పంట వేసిన 30–35 రోజుల వ్యవధిలో కలుపు నివారణ హిమజిత్‌ఫైర్ లీటరు నీటికి 2.5 మీ.లీ. కలిపి స్ప్రే చేస్తే కలుపుని తగ్గించవచ్చునని చెప్పారు. పంట వేసిన 30–40 రోజుల తరువాత 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ వేసుకోవాలన్నారు. పంట పూత దశలో కేజీ 19–19–19, కేజీ 130 –45, ఈ 2 కేజీలు 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే 30 నుంచి 40 శాతం వరకు దిగుబడులు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్ వీహెచ్ఏ, సతీష్, ఎంపీవో, గ్రామ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

ముత్యమాంబ తీర్థం నేడు

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లిలో ముత్యమాంబ తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి తెలిపారు. ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు, ప్రజలు సహాయ సహకారాలతో మధ్యాహ్నం నుంచి మహిళల కోలాట ప్రదర్శన, రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.